మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## పాఠ్య పుస్తకాలు విక్రయించిన ఇద్దరు వర్కర్ల సస్పెండ్...



పాత ఇనుప సామాన్ దుకాణంలో పాఠ్య పుస్తకాలు

**అచ్చంపేట, జూన్ 27 ప్రభాత వార్త:** పేద విద్యార్థులకు అందించాల్సిన పాఠ్య పుస్తకాలను పక్కదారి పట్టించిన ఆశ్రమ పాఠశాల సిబ్బందిపై వేటు పడింది. బుధవారం రాత్రి గోదాం నుంచి పాఠ్య పుస్తకాలను పాత ఇనుప సామాన్ దుకాణానికి తరలించగా స్థానికులు పట్టుకున్న విషయం విధితమే. ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అందించాల్సిన పాఠ్య పుస్తకాలను పాత ఇనుప సామాన్ దుకాణానికి విక్రయించిన ఇద్దరు వర్కర్లను సస్పెండ్ చేశారు. గోదాం ఇన్‌చార్జి తిరుపతయ్యకు షోకాజ్ నోటీసులు అందించినట్లు డీటీఓకు కమలాకర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

## భరోసా నూతన భవనాన్ని పరిశీలించిన ఎస్పీ శ్రీనివాస్ రావు



**గద్వాల ప్రతినిధి జూన్ 27 ప్రభాతవార్త:** భరోసా నూతన భవనాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ తోట శ్రీనివాసరావు, జిల్లా కేంద్రంలోని రెవెన్యూ కాలనీలో నూతనంగా నిర్మాణం అయిన భరోసా భవనాన్ని జిల్లా ఎస్పీ తోట శ్రీనివాస రావు అదనపు ఎస్పీ గుణ శేఖర్ తో కలిసి పరిశీలించారు. 2 కోట్లతో నిర్మించిన భవన నిర్మాణం పూర్తి కావచ్చినందున త్వరలో ప్రారంభించేందుకు భవనాన్ని సిద్ధం చేయాలని భరోసా ఇంచార్జి ఎస్సై అరుణకి సూచించారు. ఈ కార్యక్రమంలో గద్వాల్ సిఐ బీమ్ కుమార్, భరోసా కో ఆర్డినేటర్ శివాన తదితరులు పాల్గొన్నారు.

## రైతులు సేద్యం చేసేనాటికి విత్తనాలు అందుబాటులో ఉండాలి

**ఎరువులకు లోటు లేకుండా చూసుకోవాలి: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి జూన్ 27 ప్రభాతవార్త :** రైతులు సేద్యం చేసేనాటికి విత్తనాలు అందుబాటులో ఉండాలి. ఎరువులకు లోటు లేకుండా చూసుకోవాలి అని గురువారం మధ్యాహ్నం కలెక్టర్ తన ఛాంబర్ లో వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షాలు ప్రారంభమై రైతులు సేద్యం చేసే సమయం ఆసన్నమైనందున రైతులకు అవసరమైన విత్తనాలు కానీ ఎరువులు కానీ కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. స్పందించిన జిల్లా వ్యవసాయ అధికారి జిల్లాలో సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఎరువులు, విత్తనాల నిలువల గణాంకాలు తెలియజేశారు. జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, వ్యవసాయ ఏ.డిలు, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌తో డాక్టర్‌ల చర్చలు సఫలం సమ్మె విరమణ



**గద్వాల ప్రతినిధి జూన్ 27 ప్రభాతవార్త:** ప్రైవేటు ఆసు పత్రుల డాక్టర్లపై ప్రజల దాడి ఘటనపై చేపట్టిన నిరసనను విరమించుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ డాక్టర్లను కోరారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబ ర్లో జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు, ప్రైవేటు డాక్టర్లు, జిల్లా అధి కారులతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో రెండు రోజుల క్రితం – మిగతా2లో..

# పారదర్శకంగా గృహజ్యోతి..



గృహజ్యోతి ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

- ధరణి పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష
- ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వద్దు
- ఎరువుల దుకాణాల్లో రికార్డుల తనిఖీ
- కస్తూర్బా విద్యార్థులతో మాటామంతి
- జిల్లా కలెక్టర్ విజయేంద్రి బోయి



ధరణి పెండింగ్ దరఖాస్తు వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

**చిన్నచింతకుంట,జూన్ 27 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి గురువారం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రజా పాలనలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో గృహజ్యోతి ఆన్‌లైన్ ప్రక్రియను కలెక్టర్ విజయేంద్రిబోయి పరిశీలించారు. పారదర్శకంగా గృహజ్యోతి ఆన్‌లైన్ నమోదు చేయాలని ఎంపిడిఓ సుధాకర్‌రెడ్డి, తహసిల్దార్ కృష్ణయ్యలను ఆదేశించారు. లబ్దిదారుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని గృహజ్యోతి ఆన్‌లైన్ నమోదు కేంద్రాల సంఖ్యను పెంచాలని సూచించారు. గృహజ్యోతి ఆన్‌లైన్ నమోదులో పొరపాట్లకు తావియ్యరాదని ఆమె ఆదేశించారు. తహసిల్దార్ కార్యాలయంలో ధరణి స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ధరణి పెండింగ్ దరఖాస్తులపై తహసిల్దార్‌తో కలిసి సమీక్షించారు. ధరణి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. పాత రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు రైతులు తమ భూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రభుత్వ దవఖాన ఆవరణలో అమ్మాపూర్ గ్రామానికి చెందిన మహిళ రోగిని వైద్య సేవలను గూర్చి కలెక్టర్ ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి రాహుల్‌ను వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారిణి ఆదేశించారు. గర్భిణీ స్త్రీలకు వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ – మిగతా4లో..



ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌తో మాట్లాడుతున్న కలెక్టర్



ఎరువుల దుకాణంలో స్టాక్ రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్



కస్తూర్బా విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

## విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు ఉండాలి..

**నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

**మక్తల్,జూన్ 27 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు ఉండాలని, తాగునీటి వసతి కల్పించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం ఆమె మక్తల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి ద్వారా ఏఏ పనులు చేపట్టారు? ఇంకా ఏం పనులు చేయాల్సి ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో 560 మంది విద్యార్థులు ఉన్నారని తెలుసుకున్న ఆమె వారి సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పించాలని ఆదేశించారు. పాఠశాలలోని పలు తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. గురువారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏం తిన్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అందరికి యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు వచ్చాయా అని అడిగారు. ఇంకా కొంతమందికి యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు అందలేదని విద్యార్థుల ద్వారా తెలుసుకున్న కలెక్టర్ వెంటనే, ఆయా విద్యార్థులకు యూనిఫాంలు పాఠ్యపుస్తకాలు అందజేయాలని అధికారులకు సూచించారు. పాఠశాలలోని పదో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతిలో 10జిపిఎ ఎంత మంది సాధిస్తారని విద్యార్థులను అడిగారు. మీకు అవసరమైన వసతి సౌకర్యాలను, విద్యా ప్రమాణాలను పెంచేందుకు తాము కృషి చేస్తామని, డిసెంబర్ వరకు సిలబస్ కూడా పూర్తవుతుందని, చివరగా కష్టపడి పరీక్షలు రాసి 10 జిపిఎ సాధించాల్సింది మీరే అని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఆమె – మిగతా4లో..

## జ్ఞానవంతమైన విద్యను అందించాలి...

**- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 27 ప్రభాతవార్త:** తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తులు అంతస్తుల కన్న ముఖ్యంగా జ్ఞానవంతమైన విద్యను అందించాలని నాగర్‌కర్నూల్ జిల్లా ఎమ్మెల్యే ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులను ఎమ్మెల్యే ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాలో తెలుగు మహాసభలకు వెళ్లినప్పుడు అక్కడ ఉన్నవారందరు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదిగారని, మీరందరు కూడా ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఎమ్మెల్యే అకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు సరిగ్గా చెప్పరనే అపవాదు, చాలా మంది తల్లిదండ్రుల్లో ఉందని, ప్రభుత్వ పాఠశాలల్లోనే జ్ఞానవంతమైన ఇంగ్లీష్ మీడియం విద్య అందుతుందని, ఇది తెలియకనే చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివిస్తూ వేల రూ॥లు ఫీజులు చెల్లిస్తూ ప్రైవేటు పాఠశాలల్లో బట్టీ చదువులు తప్ప జ్ఞానవంతమైన విద్యను అందించడం లేదుని, ప్రభుత్వ పాఠశాలల్లో సమర్థమైన శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పని చేస్తున్నారన్నారు. వారి కృషి ఫలితంగానే ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. మంచి పాఠశాలలు, విద్యాబోధన వసతులు,మంచి ఆహారం ఉంటే విద్యార్థులు ఉత్సాహంతో చదువుకుంటారని – మిగతా4లో..

## బ్యాంకర్లు రుణాల లక్ష్యాలను చేరుకోవాలి..

**8390 కోట్ల 62 లక్షల రూపాయలకు**

**కేటాయింపుతో 2024,25**

**జిల్లా వార్షిక రుణ ప్రణాళిక విడుదల**

**చేసిన కలెక్టర్ బి.విజయేందిర**



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్రి బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జూన్ 27 ప్రభాతవార్త :** బ్యాంకర్లు ప్రజలకు అందించే రుణాల్లో నిర్దేశించబడిన లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని జిల్లా కలెక్టర్ బి.విజయేందిర బోయి అన్నారు. బుధవారం సమీకృత కలెక్టర్ సమావేశ మందిరంలో 2023,24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ప్రగతిపై – మిగతా4లో..

## దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి..

**-ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**



దివ్యాంగులకు వాహనాలను అందిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 27 ప్రభాతవార్త:** దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ఆసరా ఫించన్‌తో పాటు బ్యాటరీ ట్రైసైకిళ్లు, వీల్ చైర్లు వంటి – మిగతా3లో..

## రూ.కోటీ 80లక్షలతో ఉడాయించిన ఫైనాన్స్ వ్యాపారి..

**పోలీస్ స్టేషన్ తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన బాధితులు**



డిప్యూటీ తాహసిల్దార్ ఫిర్యాదు చేస్తున్న బాధితులు

**వీపనగండ్ల జూన్ 27 ప్రభాతవార్త :** తాను ఫైనాన్స్ వ్యాపారం నిర్వహించుకుంటున్నానని అందుకు మీ దగ్గర వడ్డీకి డబ్బులు ఉంటే ఇవ్వండి అని కొంతమంది దగ్గర వడ్డీకి దాదాపు కోటి 80 లక్షల రూపాయలకు పైగా డబ్బులు తీసుకొని వడ్డీలకు ఇచ్చినటువంటి బాధితులకు టోకరా వేసి ఐటి దాఖలు చేసినటువంటి ఉదాత్తం ఒకటి వెలుగులోకి వచ్చింది బొలెమోని ఆంజనేయులు సన్నాఫ్ బాబు అనే వ్యక్తి దాదాపు 60 మంది తో డబ్బులు తీసుకొని ఊడయించారు. అయితే మీరంతా గురువారం నాడు స్థానిక పోలీస్ స్టేషన్, తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదులు అందజేశారు. భాదితుల కథనం ప్రకారం మండలంలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన బొలెమోని ఆంజనేయులు సన్నాఫ్ బాబు అనే వ్యక్తి పెబ్బేరులో ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాను అని చెప్పి ఒక్కొక్కరికి దగ్గర లక్ష నుండి 8 లక్షల వరకు రెండు రూపాయల వడ్డీ చెల్లిస్తానని ప్రాంసరీ నోట్ పేపర్లపై సంతకం పెట్టి తమను నమ్మించి ఇప్పించుకున్నాడని బాధతులు బోరెల్లి చంద్రమ్మ, కొట్టం లక్ష్మయ్య, కుమ్మరి నాగన్న, పులగూరి రాముడు, గూడెం సాయిలు, విజయకుమార్, తదితరులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ పొట్టకూటి కోసం చేసుకొని కష్టపడి కూడబెట్టుకున్న డబ్బు తో తమ ఆరోగ్యాలు బాగు చేసుకోవాలని అనుకొని ఉంచుకున్న డబ్బును మమ్మల్ని బొలెమోని ఆంజనేయులు సన్నాఫ్ బాబు, అతని భార్య చంద్రకళ – మిగతా4లో..

## అమ్మ ఆదర్శ పాఠశాలలు ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలి

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



ఉన్నత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి జూన్ 27 ప్రభాతవార్త :** అమ్మ ఆదర్శ పాఠశాలల ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి అని గురువారం ఉదయం ఐ.డి.ఒ.సి కాన్ఫరెన్స్ హాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతి, విద్యార్థుల ఏక రూప దుస్తుల పంపిణీ మీద ఇంజనీరింగ్, విద్యాశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని 329 పాఠశాలలను ఎంపిక చేసి అమ్మ ఆదర్శ పాఠశాల కింద మౌలిక సదుపాయలు కల్పించేం దుకు పనులు ప్రారంభించి ఇప్పటికే పనులు పూర్తి అయిన వాటికి మండలానికి మూడు చొప్పున ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మరికొన్ని పాఠశా లల్లో పనులు కొనసాగుతున్న వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యిందని, ఏ పాఠశాల ఏ తేదీన పూర్తి చేసి ఇస్తారో లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాలని కార్యనిర్వాహక ఇంజనీర్లను ఆదేశించారు. పనులు పూర్తి అయిన వాటిని మండల విద్యా అధికారులు పరిశీలించి ప్రధానోపాధ్యాయునితో కలిసి – మిగతా3లో..

## ఆల్‌ఫెండజోల్ మాత్రలు పంపిణీ..!!

**భూత్పూర్,జూన్ 27,ప్రభాతవార్త :** పిల్లల్లో నులిపురుగులు చేరి వారి ఎదుగుదల,బరువు తగ్గడం వంటి అనారోగ్య సమస్యల్ని దూరం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏడాది మొదలు 19ఏళ్ల మధ్య వయస్కులైన విద్యార్థిని, విద్యార్థులు,చిన్నారులకు పంపిణీ చేసిన అల్‌ఫండజోల్ మాత్రల్ని వారి చేత తినిపించేందుకు చర్యలు చేపట్టింది.ఈ క్రమంలో భాగంగా మిగిలి పోయిన పిల్లలకు భూత్పూర్ పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్‌తో పాటు సీహెచ్‌ఓ అయూబ్‌ఖాన్ ఇతర వైద్య సిబ్బంధి గురువారం భూత్పూర్ పట్టణం బీసీ కాలనీలో ఉన్న ఠాగూర్ మెమోరి యల్ స్కూల్‌లో మిగిలి పోయిన విద్యార్థిని,విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేయడంతో పాటు పిల్లలకు దగ్గరుండి మాత్రల్ని మింగించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గొడుగు వెంకటయ్య, ప్రిన్సిపాల్ కాడ్లూర్ చాముండేశ్వరి ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఈరట్వాన్‌పల్లి పాఠశాలకు వాటర్ ఫిల్టర్ వితరణ



**ఉప్పునుంతల,జూన్27 ప్రభాతవార్త:**మండలంలోని ఈరట్వాన్‌పల్లి మండల ప్రాథమిక పాఠశాలకు స్థానిక ఎంపిటిసి బూరం మల్లేష్ వాటర్‌ఫిల్టర్ వితరణ చేశారు.గత కొన్ని రోజుల నుంచి తాగునీటి కోసం విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆపాఠశాల హెచ్‌ఎం బండారు జంగయ్య గ్రామస్తుల దృష్టికి తీసుకెళ్లారు.దీంతో స్పందించిన ఎంపిటిసి బూరం మల్లేష్ యాదవ్ తనసొంత ఖర్చుతో డ్రింకింగ్ వాటర్‌ఫిల్టర్‌ను బహూకరించారు.దీంతో పాఠశాలసిబ్బందితో పాటు గ్రామస్తులు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. బహూకరణ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ కేశమోని లింగమ్మ, ఆ పాఠశాల హెచ్‌ఎం బండారు జంగయ్య, ఉపాధ్యాయులు రాము, మాజీ సర్పంచ్ లింగమయ్య యాదవ్, మాజీ ఉపసర్పంచ్ సూర్యనాయక్, గ్రామస్తులు రాములు, రమేష్, శ్రీశైలం, నారయ్య, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన జిల్లా సీనియర్ సిటిజెన్ ఫోరం అధ్యక్షుడు మోహన్‌రావు

**గద్వాల్ జూన్ 27 ప్రభాతవార్త:** సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు నూతనంగా వచ్చిన గద్వాల జిల్లా ఎస్పీ తోట శ్రీనివాసరావుని మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు.ఆయనతో మాట్లాడుతూ గద్వాలలో ప్రైవేట్ హస్పిటల్ డాక్టర్లు యాజమాన్యాలు ప్రజలకు మధ్యజరుగుతున్న విషయాల గురించి మాట్లాడారు. గద్వాల జిల్లా నందు సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి జిల్లా కలెక్టర్ ఎస్పీ డిఎం అండ్‌హెచ్‌ఓ హస్పిటల్ యాజమాన్యం డాక్టర్లు, ప్రజలు సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు, పురప్రముఖులు పెద్దలు అందరితో కలిపి సమన్వయం చేసే విధంగా ఒకసారి అందరూ కలిసి మాట్లాడితే బాగుంటుందని సూచించగా జిల్లా కలెక్టర్, ఎస్పీ, బాధితులు డాక్టర్లసంఘం నాయకుల తో చర్చించి సమ్మెను విరమింపచేసినందుకు వారికి సీనియర్ సిటిజన్ ఫోరం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. 10 నుంచి 20 రోజులలో అలాంటి సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి మాట్లాడడం మంచిదే అలాంటి దాన్ని ఏర్పాటు చేద్దామని ఎస్పీ తెలిపినట్లు తెలిపారు. సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు మోహన్ రావు, ఎస్పీ అచ్చన్న గౌడ్, వెంకట్రాం రెడ్డి,బాలకృష్ణరావు,పద్మ,శీలరాములు, ఎస్ రమేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆనందగిరి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**బిజినేపల్లి, జూన్ 27 ప్రభాతవార్త :** ఈనెల 29 నుండి శ్రీ ఆనందగిరి గోదా సమేత లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గురువారం ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. 29న ఉదయం కోయిల్ అళ్వారు తిరుమంజసం (అభిషేకం) తీర్థప్రసాద వినియోగం సాయంత్రం ఊరేగింపు, విశ్వక్సేనారాధన, పుణ్యావాహవాచనం ఋత్విగ్వణా రక్షాబంధనం మృత్యంగ్రహణం, అంకురార్పణం, తీర్థ ప్రసాద వినియోగం రాత్రికి హరికథ 30న ఆదివారము వేద పారాయణం, ప్రబంధ పారాయణం, 8 గం.లకు అగ్ని ప్రతిష్ఠ, కలశ స్థాపన, ధ్వజారోహణం 9.30 గం.ల నుండి సుదర్శన హోమం, సాయంత్రం నుండి విష్ణు సహస్రనామ పారాయణము, భేరిపూజ, దేవతాహ్వానము, ద్వాదశారాధన, హోమం, బలిహరణం, రాత్రి గరుడ వాహనసేవ, ఎదురుకోళ్ళు, ఏకపాత్రాభినయం, జులై 1న సోమవారం పూర్ణాహుతి, శ్రీవారి కళ్యాణ మహోత్సవం, తీర్థప్రసాద వినియోగం,అన్నప్రసాదం, ధ్వజారోహణం, దేవతా విసర్జనముద్ధాశారాధనలు, శేషవాహన సేవ, సప్తావరణములు, తీర్థప్రసాదములు మహాదాశీర్వాదము, ఋత్విక్ సన్మానము నిర్వహిస్తున్నట్లు అర్చకులు కొరివి విజయ రాఘవాచారి వివరించారు.

## ప్రమాణస్వీకారం చేసిన కన్నయ్యశెట్టి



**దేవరకద్ర,జూన్ 27 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ ది పాలమూరు కో-ఆపరేటివ్ అర్బన్‌బ్యాంకు లిమిటెడ్ డైరెక్టర్‌గా దేవరకద్రకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కల్వ కన్నయ్యశెట్టి గురువారం ప్రమాణస్వీకారం చేశారు. మహబూబ్‌నగర్‌లో ఈ నెల 22న 2024 ఏడాదికి గాను మహబూబ్‌నగర్ ది పాలమూరు కో-ఆపరేటివ్ అర్బన్‌బ్యాంకు లిమిటెడ్ డైరెక్టర్లుగా దాదాపు 12 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.అందులో దేవరకద్రకు చెందిన కల్వ కన్నయ్యశెట్టి కూడ ఉన్నారు.ఈ సందర్భంగా సంబందిత బ్యాంకు ఎన్నికల అధికారి డైరెక్టర్ నియామక పత్రాన్ని కల్వ కన్నయ్యశెట్టికి అందజేశారు.ది పాలమూరు కో-ఆపరేటివ్ అర్బన్‌బ్యాంకు లిమిటెడ్ డైరెక్టర్‌గా ఎన్నికైన కల్వ కన్నయ్యశెట్టిని పలువురు అభినందించారు.మహబూబ్‌నగర్‌లోని వాసవిగార్డెన్‌లో ఉదయం 11లకు ప్రమాణస్వీకారం కార్యక్రమాన్ని నిర్వహించారు.

## జిల్లా కలెక్టర్‌తో డాక్టర్‌ల చర్చలు సఫలం సమ్మె విరమణ

**మొదటి పేజీ తరువాయి భాగం...**

ప్రైవేటు ఆసుపత్రి డాక్టర్లపై జరిగిన దాడిని నిరసిస్తూ ప్రైవేటు ఆసుపత్రుల డాక్టర్లు బంద్ కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా డాక్టర్లు, ప్రజలు సంయమనం పాటించాలన్నారు. జరిగిన సంఘటనపై విచారణ చేపట్టేందుకు ఇండిపెండెంట్ కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టడం జరుగుతుందన్నారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రజలు చట్టాన్ని తమ చేతిలోకి తీసుకోకుండా, చట్టపరంగా చర్యలు చేపట్టేందుకు పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. డాక్టర్లకు, ప్రజలకు ముమ్ముందు ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. చికిత్స సమయంలో పేషెంట్ మరణించి నట్లయితే డాక్టర్లు ప్రజలకు స్పష్టంగా కారణాలను తెలియపరిచినట్లయితే ఇలాంటి ఘటనలు జరగకుండా నివారించవచ్చు అన్నారు. డాక్టర్లు వెంటనే తమ సమ్మెను విరమించుకుని ప్రజలకు అందుబాటులో ఉండి మంచి వైద్య సేవలు అందించాలన్నారు. జిల్లా కలెక్టర్ సూచనలు మేరకు ప్రైవేటు డాక్టర్లు తమ సమ్మెను విరమించుకుంటున్నట్లు తెలిపారు.

# సౌరశక్తి ద్వారా బ్యాటరీలను శక్తివంతం చేయడం అభినందనీయం..

### కొత్త టెక్నాలజితో రూపొందించిన కొత్త బ్యాటరీ రీక్షా కాలుష్యం నుండి కాపాడుతుంది: జడ్పీ చైర్మన్ సరిత తిరుపతయ్య

**గద్వాల ప్రతినిధి జూన్ 27 ప్రభాతవార్త:** ఏఐటీయూసీ కార్మికుల యొక్క బ్యాటరీ ఆటో రీక్షాలను జడ్పీ చైర్మన్ సరిత తిరుపతయ్య ప్రారంభించారు. భారతీయ నగరాల్లో తమ ఉనికిని చాటుకోవడం ప్రారంభించిన బ్యాటరీతో నడిచే ఆటో రిక్షాలు, సౌరశక్తి ద్వారా బ్యాటరీలను శక్తివంతం చేయడం ద్వారా భారతదేశం మరో అడుగు ముందుకేసిందని ఆమె అన్నారు. పోల్యూషన్ లేని ప్రజల ఆరోగ్యానికి హాని చేయని బ్యాటరీతో నడిచే రిక్షాలను ప్రారంభించడం సంతోషంగా ఉందని జెడ్పీచైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గం ఇంచార్జి సరిత తిరుపతయ్య అన్నారు. గద్వాల జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆవరణలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సిపిఐ జిల్లా కార్యదర్శి అంజనేయులు, ఏఐటీయూసీ కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్మికుల యొక్క కొత్త బ్యాటరీ ఆటో రిక్షాల ప్రారంభోత్సవం కార్యక్రమంలో జడ్పీచైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరితమ్మ పట్టణ మున్సిపలన చైర్మన్ బిఎస్ కేశవ్ , జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతీయ రహదారులపై ఈ రీక్షాలు కాలుష్యాన్ని తగ్గించగలన్నారు. దేశావ్యాప్తంగా నగరాల్లో కాలుష్యం యొక్క ప్రమాదకర స్థాయిలపై చర్చలు జరుగుతున్నప్పటికీ,బ్యాటరీతో పనిచేసే ఇ రీక్షాలు స్వచ్ఛమైన గాలిని పీల్చుకోవచ్చని, చట్టపరమైన ఆమోదం పొందిన ప్రధాన నగరాలలో ఈ వాహనాలను ఇప్పటికే ఉపయోగంలోకి తీసుకొచ్చారని, గద్వాలలో కూడా ఇలాంటి రిక్షాలు రావడం సంతోషం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బి.ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మధుసూదన్ బాబు, ఏఐటీయూసీ ఆటో రీక్షా కార్మికులు, కాంగ్రెస్ పార్టీ లత్తిపురం వెంకట్రామిరెడ్డి, మహ్మద్ ఇసాక్, నరహరి గౌడ్, టి.శ్రీనివాసులు, పులిపాటి వెంకటశ్, ఎల్లప్ప, నాగేంద్ర యాదవ్, డిటిడిసి నర్సింహులు, కోటేష్, నాగశంకర్, రంజిత్ కుమార్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ సిపిఐ, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





బ్యాటరీ రిక్షాలను ప్రారంభిస్తున్న జడ్పీచైర్మన్ సరిత, మున్సిపల్ చైర్మన్ కేశవ్ , నాయకులు

## ప్రజా సేవకు పదవీ విరమణ లేదు...

### - చివరి మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ, ఎంపీటీసీలకు ఘన సన్మానం

**వెల్దండ, జూన్ 27 ప్రభాతవార్త:** నిత్యం ప్రజల్లో ఉండే ప్రజా నాయకులకు పదవి విరమణ లేదని, తిరిగి ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొంది ప్రజా సేవ చేయడానికి ప్రజా ప్రతినిధులకు మాత్రమే ఉంటుందని ఎంపీపీ విజయ జైపాల్‌నాయక్, జెడ్పీటీసీ సభ్యులు ధ్యాప విజితారెడ్డిలు అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ విజయజైపాల్‌నాయక్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొని తమ నివేధికను చదివి వినిపంచారు. మండలంలో విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని రాచూర్ ఎంపీటీసీ గుత్తి వెంకటయ్య సభ దృష్టికి తీసుకొని రావడంతో, ఇన్‌చార్జి ఏఈ మేఘనాథ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వంలోనే నాణ్యమైన 24 గంటల ఉచిత విద్యుత్ అందుతుందన్నారు. చిన్నపాటి గాలులకు, వర్షాలకు అక్కడక్కడ విద్యుత్ అంతరాయం వస్తుంది తప్ప ఎక్కడ ఎటువంటి అంతరాయం కలుగడం లేదన్నారు. ఎంపీటీసీ మోతిలాల్‌నాయక్ మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు పట్టాలు చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. అధికారులు అవినీతికి పాల్పడకుండా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించినప్పుడే మండలానికి మంచి పేరు వస్తుందన్నారు. వచ్చే నెల 3వ తేదీకి ఎంపీటీసీల పదవి కాలం ముగియడంతో చివరి మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ విజయజైపాల్‌నాయక్, వైస్ ఎంపీపీ శాంతిగోపాల్‌నాయక్, జెడ్పీటీసీ సభ్యులు విజితారెడ్డి, ఎంపీటీసీలను ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి మెమెంటోలను బహుకరించారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ రేవంత్‌రెడ్డి, ఎంపీఓ సునిత, ఆయా శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.



ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జెడ్పీటీసీలతో పాటు, ఎంపీటీసీలను సన్మానిస్తున్న అధికారులు

## మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి

### సాగర్ స్నేక్ సొసైటీ వ్యవస్థాపకుడు కృష్ణసాగర్ పాదయాత్ర

**కొత్తకోట జూన్ 27 ప్రభాతవార్త :** మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి. అని సాగర్ స్నేక్ సొసైటీ వ్యవస్థాపకులు కృష్ణసాగర్ అన్నారు. ఈ నెల 20వ తేదీన అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు చేపట్టిన పాదయాత్ర బుధవారం సాయంత్రం కొత్తకోటకు చేరుకుంది. దింతో పట్టణ నాయకులు కృష్ణ సాగర్ కు ఘన స్వాగతం పలికారు. గురువారం ఉదయం అయ్యప్ప స్వామి దేవాలయం దగ్గర, భగీరథ మహర్షి, చత్రపతి శివాజీ విగ్రహాల దగ్గర పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొత్తకోట పోలీస్ స్టేషన్, రోడ్డు ఇరువైపులా సీఐ రాంబాబు, ఎస్సై మంజునాథ్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం సాగర్ కులస్తులు కలిసి బైపాస్ పాసుబుక్ వరకు పాదయాత్రగా వెంట గ్రామానికి చేరుకొని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కార్యక్రమం కల్పించారు. అదేవిధంగా మాజీ పార్లమెంట్ సభ్యులు రావు చంద్రశేఖర్ రెడ్డి ఘన స్వాగతం పలికి శాలువతో సత్కరించి అభినందించారు. అ నుంచి కనిమెట్ట గ్రామానికి చేరుకోగా గ్రామస్తులు కోటేశ్వర్ రెడ్డి మరి కొందరు కలిసి కృష్ణసాగర్ కి స్వాగతం పలికి మొక్కలు నాటించారు. అడ్డాకల్ వైపు ప్రయాణం సాగింది. ఈ కార్యక్రమంలో నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సీఐ ఎస్సై

## అధికారులు గ్రామాలలో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

**అమరచింత జూన్ 27 ప్రభాతవార్త :** వర్షాకాలం సీజన్లో ప్రజలు రోగాల బారినపడకుండా అధికారులు గ్రామాలలో పారిశుధ్యం పై దృష్టి సారించాలని వనపర్తి జిల్లా డిపిఓ రమణమూర్తి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గరువారం అమరచింత మండల పరిధిలోన సింగంపేట గ్రామంలో ఆకస్మికంగా పర్యటించారు. గ్రామంలో డ్రైనేజ్ కాలువలో మురుగునీరు నిల్వ ఉండడం చూసినా ఆయన తక్షణమే గ్రామ సిబ్బంది తో మురుగు కాలువలను శుభ్రపరిచారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలం సీజన్ లో వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా మురుగు కల్వలను శుభ్రపరిచి, బ్లీచింగ్ పౌడర్ వేయాలని గ్రామాలలో ప్రజలను రోడ్లపై చెత్త వేయకుండా గ్రామ పంచాయతీ సంబంధించిన ట్రాక్టర్ల పై ప్రజలు చెత్తను వేయాలని ఆయన ప్రజలను కోరారు. ఆయా పరిసరాలలో నీటి నిల్వ ఉండడం వల్ల దోమలు, ఈగలు వాలి మలేరియా, టైఫాడ్, డెంగీ వ్యాధులు సంభవించే అవకాశం ఉందని ప్రజలు తమ పరిసరాలలో నీటి నిల్వ ఉంచకుండా ఉండాలని ఆయన ప్రజలను కోరారు. పారిశుధ్యం పై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన అన్నారు. అనంతరం గ్రామపంచాయతీలలో రికార్డులను, గ్రామంలో రోడ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీఓ, నర్సింహులు, గ్రామ కార్యదర్శి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



సింగంపేట గ్రామంలో ఆకస్మికంగా పర్యటించిన డిపిఓ

## ఏరి కోరి వస్తున్నారు... అనిశాకు చిక్కుతున్నారు..

**వెల్దండ, జూన్ 27 ప్రభాతవార్త:** హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో వెల్దండ మండలం. హైదరాబాద్ నుంచి విధులకు రావడానికి అనువుగా ఉండటంతో పాటు రియల్ రంగం, మైనింగ్, ఇసుక దందాలకు భలే డిమాండ్ ఉండటంతో అధికారులు మండలంలో పోస్టింగ్ కోసం పైరవీలు చేసి ఏరి కోరి వస్తున్నారు. వచ్చిందే తడువుగా డబ్బు సంపాదించాలనే దుర్బద్ధితో అవినీతి అవతారమెత్తి కొంత మంది అధికారులు పెద్ద ఎత్తున డబ్బులు సంపాదించుకొని బయట పడితే... మరికొందరు అనిశాకు బలవుతున్నారు. ఇప్పటి వరకు వెల్దండ మండలంలో ముగ్గురు ప్రభుత్వ అధికారులు అనిశా అధికారులకు చిక్కారు. 2009 డిసెంబర్‌లో మండల కేంద్రానికి చెందిన ఓ హోటల్ యజమాని కృష్ణారెడ్డి ద్వారా రూ.5వేల లంచం తీసుకుంటూ అప్పటి ఎస్ఐ మురళికృష్ణ, కానిస్టేబుల్ శ్యాంసుందర్, 2021న తహసీల్దార్ సైదులు, తాజాగా ఎస్ఐ రవిలు మంగళవారం ఏసీబీ అధికారులకు పట్టుబడి కటకటపాలయ్యారు. అధికారులు ప్రజలను వేధించకుండా, తమ ఉద్యోగ ధర్మాన్ని న్యాయంగా చేస్తే ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా మండలానికి కూడా మంచి పేరు వస్తుందని, అధికారులు చేసే అవినీతి పనులకు మండలానికి సైతం చెడ్డ పేరు వస్తుందని మండల వాసులు పేర్కొంటున్నారు.

## ఘనంగా పదవీ విరమణ సన్మానోత్సవం

**ఉప్పునుంతల,జూన్ 27 ప్రభాతవార్త :** మండలంలోని వెల్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న గెజిటెడ్ హెచ్‌ఎం వేదవతి పదవి విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన పదవి విరమణ కార్యక్రమానికి హాజరైన పలువురు మాట్లాడుతూ అతి తక్కువ సమయంలో వెల్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన నెలలోనే పదవి విరమణ పొందడం గర్వించదగ్గ విషయమన్నారు. పదవి విరమణ పొందుతున్న వేదవతి కుటుంబ సభ్యులను కార్యక్రమానికి పాల్గొన్న పలువురు శాలువాలతో ఘనంగా సన్మానించారు. వంగూరు మండలం రంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసి పదోన్నతిపై ఈ నెల 13న వెల్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగంలో చేరినప్పుడే పదవి విరమణ తేదీ ప్రకటించడం జరుగుతుందని మంచివారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి మామిళ్ల సుదర్శన్, ఉప్పునుంతల కాంప్లెక్స్ హెచ్‌ఎం, గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం అధ్యక్షుడు జటప్రోలు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు పోకల సతీష్, అమ్రాబాద్ మండల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎం లక్ష్మారావు, అమ్రాబాద్ ఉర్దూ మీడియం హెచ్‌ఎం హనుమంతురెడ్డి, ఇంద్రసేనారెడ్డి, కొత్త శ్రీధర్‌రావు, పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్‌గౌడ్, వజ్రమ్మ, సరస్వతి, విశ్రాంతి ఉపాధ్యాయులు పుల్లారెడ్డి, సింగోటం, వివిధ సంఘాలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొని గెజిటెడ్ హెచ్‌ఎం వేదవతి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు.



గెజిటెడ్ హెచ్‌ఎం వేదవతి కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న ఎస్‌టియు టీఎస్ నాయకులు

## కెసిఆర్‌ను కలిసిన ఎంపీపీ గుంత మౌనిక



**కొత్తకోట జూన్ 27 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర సాధకుడు తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ ను వారి స్వగృహము ఎర్రవల్లి ఫామ్ హౌస్ లో మాజీ మంత్రి వర్యులు నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్ లు మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కు ఎంపీపీ గుంత మౌనిక జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడ్డే శ్రీనివాసులు, ఉమ్మడి జిల్లాల బిఆర్ఎస్ అధికార ప్రతినిధి గాడీల ప్రశాంత్, గుంత సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డు ఆఫీసర్‌కు వీడ్కోలు సన్మానం..!!



**భూత్పూర్,జూన్ 27,ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపాలిటీలో బీసీకాలనీ తొమ్మిదో వార్డు ఆఫీసర్‌గా పనిచేస్తున్న బీచుపల్లి ఈ నెల 30న పదవీ విరమణ పొందుతున్న నేపథ్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయంలో బీచుపల్లిని మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ శాలువలు,పూలమాలలతో ఘనంగా సన్మానించారు. బీచుపల్లి సేవలను చైర్మన్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కెంద్యాల శ్రీనివాస్,మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డితో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తూము శ్రీనివాస్‌రెడ్డి పాటు కౌన్సిలర్లు బాలకోటి,రామకృష్ణ,నాగమ్మతో పాటు కోఆప్షన్ సభ్యులు అజీజ్,జాకీర్ నాయకులు గడ్డం యాదయ్య, గడ్డం రాములు తదితరులు పాల్గొన్నారు.

## లైఫ్ కెనాల్ మోటర్ల రిపేర్‌కు నిధులు మంజూరు చేస్తా..



**కొత్తకోట జూన్ 27 ప్రభాతవార్త :** కొత్తకోట మండలం కానాయపల్లి శంకర సముద్ర లిఫ్ట్ కెనాల్ మోటర్ల రిపేర్ గురించి నిర్వీన్, పాలెం, కనిమెట్ల గ్రామ రైతులు ఇటీవల దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయం పై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ భీమా అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. గరువారం రైతులు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సూచన మేరకు పెబ్బేర్ రాజీవ్ భీమా నీటిపారుదల క్యాంప్ ఆఫీసులో ఈఈ, డిఈ, ఏఈ లను సంబంధిత అధికారులను కలిసి మోటర్లకు సంబంధించిన రిపేర్లు మెయింటెన్స్, ఎస్టిమేషన్ ఇవ్వాలని రైతుల నుండి నిధులు తీసుకొచ్చి రైతులు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుందామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కనిమెట్ట గ్రామ అధ్యక్షులు నర్కుల యాదగిరి, కోటేశ్వర్ రెడ్డి, గ్రామ కిసాన్ సెల్ అధ్యక్షులు ఆకుల శ్రీనివాసులు, నర్కుల రమేష్, నిర్విన్ రామకృష్ణ పాల్గొన్నారు.

## సీఎం, ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపిన భాష పండితులు



ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆర్డర్ కాపీలను అందుకుంటున్న ఉపాధ్యాయులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 27 ప్రభాతవార్త:** గత 20 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న భాషా పండితుల పీఈటీ 10479 పోస్టులు అప్‌గ్రేడేషన్ కళను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నేరవేర్చడంతో పండితుల ఆనందాలకు అవధులు లేకుండా పోయింది. అప్‌గ్రేడేషన్ అయిన ఉపాధ్యాయులందరు కొత్త పాఠశాలలో నియమితులయ్యారు. ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, డీఈఓ గోవిందరాజులు చేతుల మీదుగా ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులు ఆర్డర్ కాపీలను అందుకున్నారు. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షులు బి.ఈ. విజయ్ కుమార్‌తో పాటు మరికొంత మంది ఉపాధ్యాయులు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిని, సీఎం రేవంత్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

## వైద్య విద్యార్థికి ఆర్థికసాయం అందజేత



విద్యార్థి వేణుగోపాల్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

**కోయిల్‌కొండ, జూన్ 27 ప్రభాతవార్త:** పేద విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడానికి నేనున్నానంటూ ఆర్థిక సాయం అందించడానికి ముందుకు వస్తున్న ప్రముఖ వ్యాపారవేత్త మండలంలోని ఖాజీపూర్ గ్రామ మాజీ సర్పంచ్ కల్పనా బచ్చిరెడ్డి మండలంలోని పలువురు నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించి అక్కున చేర్చుకోవడం జరుగుతుంది. ఈ క్రమంలోనే మండలంలోని గార్లపాడు గ్రామానికి చెందిన వేణుగోపాల్ వైద్య విద్యలో సీటు సంపాదించాడు. చదవడానికి ఇబ్బందిగా ఉందని వందేమాతరం ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త రవిందర్‌రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త అయిన కల్పనా బచ్చిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఆయన స్పందించి వైద్య విద్యలో సీటు సంపాదించిన పేద విద్యార్థి వేణుగోపాల్‌కు రూ. 39 వేలు ఆర్థిక సాయం అందించాడు. వేణుగోపాల్ చదువు పూర్తయ్యేవరకు ప్రతి సంవత్సరం ఆర్థికసాయం అందజేయడం జరుగుతుందన్నారు. మండలంలోని నిరుపేద విద్యార్థులను ఆదుకుంటున్న కల్పనా బచ్చిరెడ్డికి వందేమాతరం ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త రవిందర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డిలు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## 30న ఖోఖో క్రీడాకారులకు సన్మానం



**మక్తల్, జూన్27 ప్రభాతవార్త:** ఈ నెల 30న జాతీయ ఖోఖో దినోత్సవాన్ని పురస్కరించు కుని మక్తల్ ఏకలవ్య స్పోర్ట్స్ క్లబ్, ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఖోఖో క్రీడాకారులను, ఖోఖో ఆటకు సేవలందిస్తున్న పీఈటీలను ఘనంగా సన్మానం చేస్తున్నట్లు ఏకలవ్య స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు విశ్రాంత బి.గోపాలం తెలిపారు. గురువారం మక్తల్ పట్టణంలో నిర్వ హించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులను సన్మానించే ఉద్దేశ్యంతో ఈ కార్యక్ర మాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆసక్తి గల ఖోఖో క్రీడాకారులు సర్టిఫికెట్ జిరాక్స్ కాపీతో హాజరై సన్మానం పొందగలరని వారు తెలిపారు. సమావేశంలో ఖోఖో క్రీడాకారులు బి.రూప, బి.శిల్ప, బి.దీప, బి.పుష్పపాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 7702713139 సంప్రదించాలన్నారు.

## నీట్ పరీక్ష అవకతవకలపై న్యాయ విచారణ జరిపించాలి

పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న యువజన కాంగ్రెస్ నాయకులు





**బాలానగర్, జూన్ 27 ప్రభాతవార్త:** నీట్ పరీక్ష పత్రాల అవకతవకలపై న్యాయ విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని పలువురు యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిప్రాయపడ్డారు. గురువారం ఈ మేరకు నీట్ ప్రశ్నా పత్రాలు లీక్ అవడానికి నిరసనగా జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బివి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సూచన మేరకు తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనరెడ్డి పిలుపు మేరకు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుయాదవ్ సూచనలతో జరిగిన పార్లమెంట్ ముట్టడిలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన ముట్టడిలో పాల్గొనడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో కేవలం దేవుళ్ళ పేరు చెప్పి కులాల మధ్య మతాల మధ్య గొడలు పెట్టి గద్దెనెక్కి బిజెపి ప్రభుత్వం పరీక్ష పత్రాలు లీక్ చేస్తూ లక్షలాది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని మండిపడ్డారు. ప్రశ్నాపత్రాల లీకుకు బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకుని న్యాయపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## యువశక్తి ఫౌండేషన్ ఆద్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ప్రభాస్ అభిమానులు

**వనపర్తి టౌన్ జూన్27 ప్రభాత వార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో యువశక్తి ఫౌండేషన్ ఛైర్మన్, ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ వనపర్తి ప్రధాన కార్యదర్శి సాయి తేజ సహకారంతో యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ రోజు ప్రభాస్ నటించిన కల్కి మూవీ విడుదల సందర్భంగా ప్రభాస్ అభిమానులచే రక్తదానం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలోసాయితేజ మాట్లాడుతూప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుగా ఉండాలి, బయపడకూడదు, రక్తదానం చేయడం వల్ల రక్తదానం తీసుకున్న వారి కంటే ఇచ్చిన వారిగా లాభం ఎక్కువ మన శరీరంలో రక్తం శాతం 14 కు మించి ఉండరాదు. రక్తం ఎక్కువగా ఉంటే గుండెపోటు, అధిక కొవ్వుతో కూడిన రోగాలు వచ్చే అవకాశంఉంది. కాబట్టి రక్త దానం చేయడంవల్ల సమాజానికి, మనకు కూడా ఎన్నోలాభాలు ఉన్నాయిఅని చెప్పడం జరిగింది. రక్తదానం మహాదానం-రక్తదానం చేయండి ప్రాణాలు కాపాడండి అని ఫౌండేషన్ చైర్మన్ సాయితేజ తెలిపారు. ఈ కార్యక్రమంలోసాయి తేజ, విజయ్ కుమార్, రోహన్‌చారి, ఎండి ఫిరోజ్, ఫయాజ్ ఖాన్, శివ, బల్వీర్, కిరణ్, శివంజీ, వెంకటేష్, మన్నెం, భాను, రాజు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో 2 గొర్రెలు మృతి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్27 ప్రభాతవార్త:** విద్యుదాఘాతానికి గురై 2 గొర్రెలు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని శ్రీపురం గ్రామంలో చోటు చేసుకుంది. గురువారం నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని శ్రీపురం గ్రామంలో కంచలేని ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా మేకల బాలయ్యకు చెందిన 2 గొర్రెలు విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందాయి. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచేలేని కారణంగానే తన గొర్రెలు మృతి చెందాయని, మృతి చెందిన గొర్రెల విలువసుమారు రూ.30వేలవరకు ఉంటుందని బాధిత రైతు బోరున విలపించాడు. ప్రభుత్వ పరంగా బాధిత రైతును ఆదుకోవాలని స్థానికులు పేర్కొన్నారు.

# వన మహోత్సవానికి సిద్ధం కావాలి

◆జిల్లాలో 30.87 లక్షల వేల మొక్కలు నాటడమే లక్ష్యం ◆మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్రిబోయి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్రి బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 27 ప్రభాతవార్త:** జులై మొదటి వారంలో వజ్రోత్సవ వన మహోత్సవం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినందున జిల్లాలో మొక్కలు నాటేందుకు అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. గురువారం మహబూబ్‌నగర్ పట్టణంలో కెసిఆర్ ఏకో పార్కులో జిల్లాస్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జిల్లాలో వజ్రోత్సవ వన మహోత్సవం కార్యక్రమంలో 30 లక్షల 87 వేల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని నర్సరీలు, నర్సరీల్లో మొక్కల లభ్యతపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 441 జి.పి.నర్సరీలు, 9అటవిశాఖ నర్సరీలు, మున్సిపాలిటీల్లో 6నర్సరీలలో మొక్కలు లభ్యంగా ఉన్నట్లు సంబంధిత అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జిల్లాకు నిర్ణయించిన లక్ష్యాన్ని వివిధ శాఖల వారిగా విభజించి లక్ష్యాలు కేటాయించినట్లు ఆమె తెలిపారు. జిల్లాలోని ఆయా ప్రభుత్వ శాఖలు కేటాయించిన లక్ష్యం ప్రకారం జులై మొదటి వారంలో నిర్వహించే వజ్రోత్సవ వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డిఎఫ్ఓ , డిఆర్‌డిఓ నర్సింహులు, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్, మున్సిపల్‌కమిషనర్‌లు, వివిధ శాఖలఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల చదువులో రాజకీయాలు వద్దు

■ రూ.60లక్షల బిల్లులు చేసుకొని సొంతంగా కట్టించానని మాజీ ఎమ్మెల్యే ప్రచారం ■ నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 27 ప్రభాతవార్త:** విద్యార్థుల చదువులో రాజకీయాలు చేయకూడదని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. తాడూర్ మండలంలోని కుమ్మెర, సిర్సవాడ గ్రామాల్లో నిర్మించిన పాఠశాలలను బుధవారం ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం పాఠశాలల్లో కొత్త సంస్కరణలు తీసుకొస్తుందన్నారు. వచ్చే డీఎస్సీ ద్వారా ఖాళీగా ఉన్న ఉపాధి పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. విద్యార్థులకు కులమాతాలతకు అతీతంగా చదువులు సాగేలా సీఎం రేవంత్‌రెడ్డి సంస్కరణలు తీసుకొస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు విద్యాశాఖను కూడా సీఎం స్వయంగా పర్యవేక్షిస్తున్నారని వివరించారు. సిర్సవాడ జెడ్పీహైస్కూల్ ప్రభుత్వ నిధులు వెచ్చించి నిర్మించడం జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్యే పాఠశాల ప్రహరి గోడ నిర్మాణానికి రూ.60లక్షల బిల్లులు చేయించుకున్నారని ఆరోపించారు.



జ్యోతి ప్రజ్వలన చేసి పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి



విద్యార్థులతో కరచలనం చేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

ప్రభుత్వ బిల్లులు చేయించుకొని సొంతంగా ట్రస్ట్ ద్వారా నిర్మించానని ప్రచారం చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. పాఠశాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యేను పాఠశాల ఉపాధ్యాయ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకగా విద్యార్థులు పూలు చల్లుతూ స్వాగతం పలుకుతూ ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులతో కరచలనం చేసి ముచ్చటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రోహిణిరెడ్డి, ఎంపీటీసీ మల్లయ్య, మండల ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

# కూచకుళ్ల ఫౌండేషన్ ద్వారా మెడికల్ కళాశాలకు బస్సు అందజేత

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 27 ప్రభాతవార్త:** ప్రభుత్వ వైద్య కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు రవాణా సౌకర్యం కోసం కూచకుళ్ల ఫౌండేషన్ ద్వారా ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డిలు బస్సును బహుమతిగా అందించారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి సతీమణి సౌభాగ్యలక్ష్మి స్మారకార్థం కూచకుళ్ల ఫౌండేషన్ ద్వారా వైద్య కళాశాల విద్యార్థులకు బస్సును బహుకరించారు. కళాశాలకు బస్సును బహుకరించిన కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, దామోదర్‌రెడ్డిలను జిల్లా కలెక్టర్, మంత్రి జూపల్లి కృష్ణరావులు శాలువాలతో ఘనంగాసన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ , వైద్య కళాశాల విద్యార్థులు తదితరులు ఉన్నారు.




వైద్య కళాశాలకు బస్సు బహుకరించినందుకు ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిలను సన్మానిస్తున్న దృశ్యం

# బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలి

●సిపిఎం రాష్ట్ర నాయకులు జాన్ వెస్లీ

**గద్వాల ప్రతినిధి, జూన్ 27 ప్రభాతవార్త:** కేంద్ర బిజెపి ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాటను ఆపి, సింగరేణికి నేరుగా కేటాయించాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ డిమాండు చేశారు. సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ముందు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కేంద్ర బిజెపి ప్రభుత్వం వేలం పాటను వేస్తున్నదని, సింగరేణి కంపెనీ కూడా ప్రైవేట్ సంస్థలతో వేలం పాటతో పోటీ పడాలని స్థితికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. వాస్తవానికి శ్రావణపల్లిలో సింగరేణి సంస్థ బొగ్గు తవ్వాలి కానీ వేలం పాట ద్వారా ప్రైవేటు సంస్థలకు అవకాశం కల్పించి బొగ్గు గనులను సరైంది కాదన్నారు. మన రాష్ట్రం నుంచి బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా వేలం పాటను ప్రారంభించడం సిగ్గుచేటు అని అన్నారు. బొగ్గు గనులన్నీ ప్రైవేటు సంస్థలకు ఇచ్చిన తర్వాత సింగరేణి మిగిలేదేముంటుందని, క్రమంగా సింగరేణి సంస్థను బలహీన పరిచి నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. నగదీకరణ పేరుతో దేశంలో ఆరు లక్షల కోట్ల విలువైన ఆస్తులను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టిందని అందులో భాగంగానే కోట్ల విలువైన గనులను ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలని నిర్ణయాన్ని తీసుకుందని విమర్శించారు. గత పది సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం దాదాపుగా 200 బొగ్గు బావులను ప్రవేశ సంస్థలకు కట్టబెట్టారని ప్రభుత్వ రంగంలో గనులు లేకపోతే యువతకు ఉపాధి అవకాశాలు కనుమరుగవుతాయి. అని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి 8 మంది బిజెపి ఎంపీలు ఉండి కూడాబొగ్గు గనుల వేలాన్ని అడ్డుకోలేకపోయారనివిమర్శించారు. ప్రస్తుతం సింగరేణి 40 వేల మంది పర్మినెంట్ కార్మికులకు మరో 26000 మంది కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నదని రికార్డు స్థాయిలో అతి తక్కువ ధరకే నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తున్న ఘనత సింగరేణి సంస్థకే చెందుతుందని అన్నారు. సింగరేణికి చెందిన 22 బొగ్గు బావుల్లో బొగ్గు నిల్వలు అడగండి పోయాయని కొత్త బ్లాకుల్లో తవ్వకాలు ప్రారంభించాలని కానీ కేంద్ర బిజెపి ప్రభుత్వం ఇందుకు అనుమతించకుండా మోకాలు అడ్డుతున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం వల్ల తెలంగాణ ప్రజానీకానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని, కాబట్టి శ్రావణపల్లి బ్లాకుతో పాటు మిగతా బ్లాక్‌లను కూడా తక్షణమే సింగరేణి అప్పగించాలని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని కలుపుకుని కేంద్రం మీద ఒత్తిడి చేయాలని డిమాండు చేశారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుని శాసనసభ తీర్మానం చేయాలని, లేని పక్షంలో ప్రజానీకాన్ని కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చూడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.రాజు వివి నరసింహ, ఉప్పేర్ నరసింహ బాలకృష్ణ, రాజు, వెంకటేశ్, పరుశురాముడు, మజ్జిగ ఆంజనేయులు, గజేంద్ర , అయ్యప్ప, నరసింహ, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.




# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి

●వనపర్తి జిల్లా ఎస్పీ రక్షిత కే మూర్తి

**వనపర్తి ప్రతినిధి జూన్ 27 ప్రభాతవవార్త:** సైబర్ నేరాల పట్ల ప్రజలు పూర్తి అవగాహన కలిగి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వనపర్తి జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి, అన్నారు. సైబర్ మోసగాళ్ల బారి నుంచి డబ్బు లు పోగొట్టుకోకుండా ప్రజలకు అవగాహన కల్పించే పోస్టర్ ను గురువారం ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఆన్ లైన్ ద్వారా లావాదేవీలు నడిపేవారు కొత్త వ్యక్తుల మాటలను నమ్మరాదని, తెలియని మెసేజ్‌లపై క్లిక్ చేయరాదని తెలిపారు. సైబర్ నేరగాళ్ళ మాయమాటలు చెప్తూ, బహుమతులు వచ్చాయని, లాటరీ తగిలిందని, లోన్లు ఇస్తామని, ఇతరత్రా ఆశ చూపి ఆన్ లైన్ ద్వారా డబ్బులకు ఎర వేస్తారని, అటువంటి వ్యక్తులు పంపే మెసేజ్ లకు స్పదించరాదని ఎస్పీ వివరించారు. ఒకవేళ అనుకోకుండా సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బులు పోగొట్టుకుంటే, తక్షణమే 155260 లేదా డయల్ 100 నంబర్లకు ఫోన్ చేసిడబ్బులు పోగొట్టుకున్నవిషయం ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. తమ అకౌంట్ లో డబ్బులు పోయిన 24 గంటల లోపుగా తెలిపిన నంబర్లకు ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న డబ్బులు వెనక్కి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. స్మార్ట్ ఫోన్ వాడే పిల్లల పట్ల తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ జె.వెంకటేశ్వరరావు సైబర్ క్రైమ్ డిఎస్పి ఎన్.బి రత్నం, ఇన్స్పెక్టర్ శ్రీను ఇతర అధికారులు పాల్గొన్నారు.



సైబర్ నేరాల పై పోస్టర్ విడుదల చేస్తున్న జిల్లా ఎస్పీ రక్షిత కే మూర్తి

## దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

ఉపకరణాలు అందజేస్తూ వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహన్ని అందిస్తుందని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జిల్లా మహిళా శిశు దివ్యాంగ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు లబ్దిదారులైన దివ్యాంగులు 3 బ్యాటరీ వీల్ చైర్లు, 8 మూడు చక్రాల స్కూటర్లు, 7 హియారింగ్ పరికరాలు, 5 ట్రైసైకిళ్లు, 1 4జీ స్మార్ట్ ఫోన్, 3 చేతి కర్రలను లబ్ధిదారులకు అందించారు. 30 మంది లబ్దిదారులకు దాదాపుగా 20 లక్షల పరికరాలను దివ్యాంగులకు మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

## కోయిల్‌సాగర్‌లో నిలకడగా నీటిమట్టం

-ప్రాజెక్టులోకి కృష్ణాజలాలు సరఫరా నిలిపివేత

**దేవరకద్ర, జూన్ 27 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌లో గురువారం నీటిమట్టం నిలకడగా ఉంది. జూరాల నుండి కోయిల్‌సాగర్‌కుకృష్ణాజలాలు సరఫరాను బుధవారం రాత్రి నిలిపివేశారు. దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం నిలకడగా ఉంది. ప్రాజెక్టులో గురువారం సాయంత్రం నాటికి 14.3 ఫీట్లకు చేరింది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటినిల్వ స్థోమత 32.5ఫీట్లు. ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చి చేరుతుండటంలో కోయిల్‌సాగర్‌కు జలకళ వస్తుంది.

## చేనేత కార్మికులు దరఖాస్తు చేసుకోండి

**గద్వాల ప్రతినిధి, జూన్ 27 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఆగస్టు7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట అందించే పురస్కారాలకు చేనేత కళాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పోచంపల్లి ఇక్కత్, డర్రెస్ , జనరల్ వైరైటీస్ నారాయణ పేట గద్వాల చీరల నేత పని రకాల్లో నైపుణ్యం కలిగిన కళాకారులు ఈ పురస్కారాలకు అర్హులని చెప్పారు వీవింగ్ కేటగిరీలో 2023 డిసెంబర్ 31 నాటికి 30 సంవత్సరాల వయస్సు నిండి , వృత్తిలో పద్దేళ్ల అనుభవంకలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు . డిజైనింగ్ కేటగిరీలో 25సంవత్సరాల వయస్సు నిండి, వృత్తిలో ఐదేళ్ల కనీసం అనుభవం ఉండాలన్నారు దరఖాస్తు చేసుకునే కళాకారులు తాము తయారు చేసిన పూర్తి వస్త్రమును శాంపిల్‌గా గద్వాలలోని ఐడిఓసిలో ఉన్న తమ కార్యాలయంలో సమర్పించాలన్నారు. సమూనాగా పంపే వస్త్రము అమ్మకం చేయరాదని , తయారు చేసిన వస్త్రము లేదా డిజైన్ తానే స్వయంగా రూపొందించినట్లుగా స్వీయ ధృవీకరణ పత్రము సమర్పించాల్సి ఉంటుందన్నారు దరఖాస్తు ఫారాలు తమ కార్యాలయంలో లభిస్తాయని, జులై 5 లోగా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. వచ్చిన వరఖాస్తులనే పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నియమించబడ్డ అవార్డు ఎంపిక కమిటీకి ప్రతిపాదనలుగా పంపించడం జరుగుతుందన్నారు పురస్కారాలకు ఎంపికైన నమూనాలు అవార్డు ప్రధానం చేసిన తర్వాత సంబంధిత చేనేత కళాకారులకు పోస్టు ద్వారా తిరిగి పంపించనున్నట్లు వివరించారు.

## నేడు పెద్దమందడి మండల సర్వసభ్య సమావేశం

హాజరు కానున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**పెద్దమందడి జూన్27 ప్రభాతవార్త:** మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ రఘు ప్రసాద్ అధ్యక్షతన జరగనుంది. అలాగే మండలంలోని వివిధ గ్రామాలలోని లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు మంజురయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలోజరిగే మండల సర్వసభ్యసమావేశానికి హాజరైమండలంలోని ఆయాగ్రామాలలో కొనసాగుతున్న అభివృద్ధిపనులపైస్థానికప్రజాప్రతినిధులతోకలిసి ఆయన చర్చించనున్నారు.

## జిల్లా నూతన ఎస్పీని కలిసిన పదవ బెటాలియన్ కమాండెంట్



**ఇటిక్యాల, జూన్ 27 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా నూతన ఎస్పీగా తోట శ్రీనివాసరావు నాలుగు రోజుల క్రితం బదిలీపై వచ్చి ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం పదవ బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య, అసిస్టెంట్ కమాండెంట్ చౌహాన్ మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రంగారెడ్డిగూడ వద్ద బైక్‌ను ఢీకొన్న లారీ



బైక్‌ను ఢీకొన్న లారీ



మృతి చెందిన యాదయ్య

**రాజాపూర్, జూన్27ప్రభాతవార్త:** రంగారెడ్డిగూడ గ్రామ శివారులో జాతీయ రహదారి 44పై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యకి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి రాజాపూర్ మండలం కుచ్చర్‌కల్ గ్రామానికి చెందిన యాదయ్యగా గుర్తించారు. షాద్‌నగర్ నుండి రాజాపూర్ వైపు వస్తున్న ఆయన ద్విచక్ర వాహనాన్ని రంగారెడ్డిగూడ గ్రామ శివారులో జాతీయ రహదారి 44పై లారీ డ్రైవర్ అరవింద్ యాదవ్ అనే వ్యక్తిఅతివేగంగా అజాగ్రత్తగా లారీ నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో యాదయ్యకు తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడని మృతునిభార్య రాజాపూర్‌పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆమె ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవినాయక్ తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకొండి

**కొత్తకోట జూన్27 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ ఇన్సూరెన్స్ సద్వినియోగం చేసుకోండని కొత్తకోట మండల బిజెపి నాయకులు రాజమౌళి ముదిరాజ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వఉద్యోగులు తప్ప కూలీలతో పాటు అందరూ అర్హులే తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి ఏడాదికి 22 రూపాయలు మాత్రమే ఐదు సంవత్సరాలు ఒకేసారి చెల్లించాలని కేవలం 110 రూపాయలు మాత్రమే అవగాహన పెంచుకుందాం అని అన్నారు. ఈ లేబర్ ఇన్సూరెన్స్ ఒకసారి 110 రూపాయలు చెల్లిస్తే ఐదు సంవత్సరాల వరకు చెల్లించిన అక్కర్లేదు అంటే మీరు చెల్లించేది సంవత్సరానికి 22 రూపాయలు అని అన్నారు. వెంటనే మీరు మీ కుటుంబ సభ్యులు స్నేహితులు బంధువులం దరినీ చేర్పించడమే కోరారు. ఇలాంటి ప్రయోజనాలు ప్రతి కుటుంబానికి అత్యంత అవసరమైనవికావున మీమండలంలోని కార్మిక అధికారిని (లేబర్ ఆఫీసర్) ఎంపిడిఓ/ఎమ్మార్వోసంప్రదించండని తెలిపారు. ఈ పథకంలో చాలామంది కార్మికులు మాత్రమే చేరవచ్చు అని అనుకుంటారు అదికానే కాదు తెల్ల రేషన్‌కార్డు కలిగిఉన్నప్రతి కుటుంబం ఈ పథకానికి అర్హులే అని తెలిపారు.

## అమ్మ ఆదర్శ పాఠశాలలు ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

పని సంతృప్తికరంగా పూర్తి అయినట్లు ధ్రువీకరణ పత్రం సమర్పించాలని సూచించారు. పనులు ప్రారంభం చేయకముందు, పని పూర్తి అయ్యాక ఉన్న ఫోటోలు విధిగా జత చేయాలని తెలియజేశారు. ఏకరూప దుస్తుల పై సమీక్షిస్తూ విద్యార్థులు అందరికీ ఏకరూప దుస్తులు ఇచ్చేయాలని, పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య ఇప్పటి వరకు ఏకరూప దుస్తులు ఇచ్చినవి, ఇవ్వకుండా మిగిలి ఉన్న దుస్తుల వివరాలు ఇవ్వాల్సిందిగా జిల్లా విద్యా శాఖ అధికారిని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, పంచాయతీ రాజ్ కార్యనిర్వహక ఇంజనీరు మల్లయ్య, రోడ్డు భవనాల శాఖ ఇంజనీరు మల్లయ్య, రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్ దేశ్యా నాయక్, పిడిడిఆర్‌డిఏ, ఉమాదేవి, విద్యాశాఖ నుంచి అధికారులు, డిఈ లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో పారదర్శకత్వే అత్యంత ప్రామాణిక్యం

- జిల్లా ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి తన నిధుల ద్వారా రూ.50లక్షలు
- రైతుల పట్ల గౌరవంగా వ్యవహరించాలి
- రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు




సమావేశంలో మాట్లాడుతున్న జూపల్లి కృష్ణారావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్27 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఈ ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు గౌరవంతమైన పాలన అందించేందుకు అధికారులు జవాబుదారితనంగా పనిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అధ్యక్షతన శాసన మండలి సభ్యులు కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, గోరటి వెంకన్న, ఎమ్మెల్యేలు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచకుళ్ల రాజేష్‌రెడ్డిలతో కలిసి నీటిపారుదల, రెవెన్యూ, వైద్య, ఆరోగ్య, మెడికల్ కళాశాల, విద్యుత్, పౌర సరఫరాలు, మిషన్ భగీరథ శాఖలపై సమీక్ష సమావేశాన్ని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రభుత్వ వ్యవస్థలపై నమ్మకం కలిగేలా అధికారుల చర్యలు ఉండాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ సమసయలపై ప్రజలకు అధికారులు గౌరవిస్తూనే వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంటుందని ఆయన చెప్పారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంతో పని లేకుండానే ప్రతి ఒక్కరికి కావాల్సిన సమాచారాన్ని అందించాలన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు ఇందిరమ్మ పాలన అందించాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం పనిచేస్తుందని, అధికారులు అదే విధంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని రైతులందరికి సాగునీరు అందించేందుకు జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇది ప్రజల ప్రభుత్వమని, ప్రజలకు ఎల్లప్పుడు ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. జిల్లా అభివృద్ధికి నిధులకు ఎలాంటి కొదవలేదని, ఆయా శాఖల అధికారులు తమ శాఖల్లో అభివృద్ధి పనుల పురోగతిలో వేగం పెంచాలన్నారు. నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్షిస్తూ... మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని వేగవంతంగా పూర్తిచేసేందుకు కావాల్సిన భూ సేకరణ పనులను అధికారులు వెంటనే పూర్తి చేయాలని అందుకు అనుగుణంగా రానున్న ఆరు మాసాల్లో ప్రాజెక్టును పూర్తి చేసి ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరానికి నీరు అందించేలా అధికారులు కృషి చేయాలన్నారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఇప్పటికే అధిక భాగం పనులు పూర్తైనందున మిగిలిపోయిన పనులు పూర్తి చేసేందుకు ఆయకట్టు పరిధిలోని ప్రతి రైతు పొలానికి నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల కాల్వల్లో జనుము, చెత్త తొలగించేందుకు ఇంజనీరింగ్ అధికారులతో కావాల్సిన ఎస్టిమేషన్ నివేధికలను రూపొందించాలన్నారు. ప్రభుత్వ ఆస్తులు, భూములను కాపాడేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై క్రిమినల్ కేసుల నమోదుతో పాటు నష్టాన్ని రికవరి చేయాలని మంత్రి రెవెన్యూ అధికారులకు సూచించారు. ధరణి సమస్యల పరిష్కారానికై ప్రతి గ్రామంలో రైతుల నుంచి వివరాలను స్వీకరించేందుకు ప్రత్యేక ప్రొఫార్మాలను రూపొందించి భూ యజమాని పేరు, భూమి అతనికి ఎలా వచ్చింది పూర్తి స్థాయి వివరాలను నమోదు చేసి ధరణి సమస్యల పరిష్కారానికి నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రంలోనే ఓ రోల్ మోడల్‌గా నిలిచేలా ధరణి సమస్యల పరిష్కారం జరగాలన్నారు. అధికారులు ప్రజలకు చిత్తశుద్దితో జవాబుదారీ తనంగా పనిచేసే వారికి రెండు చేతులు జోడించి నమస్కరిస్తామని, అందుకు అనుగుణంగా పనిచేసే అధికారులకు అదే స్థాయిలో కఠిన చర్యలు ఉంటాయని మంత్రి హెచ్చరించారు. వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో జిల్లా ఆసుపత్రి అభివృద్ధికి తన నిధుల నుంచి రూ.50లక్షలను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లో కావాల్సిన మౌళిక సదుపాయాలతో పాటు సిబ్బంది వసతులకు కావాల్సిన పూర్తి స్థాయి నివేధిక ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. సమాజంలో అన్ని వృత్తుల కంటే వైద్య వృత్తి గొప్పదన్నారు. ప్రతి ఒక్కరు డాక్టర్ సేవా భావంతో ముందుకు వచ్చి పేదలను ఆదుకోవాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందించి డాక్టర్లు మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. మెడికల్ కళాశాల, జిల్లా ఆసుపత్రికి మిషన్ భగీరథ కనెక్షన్ ఇచ్చి నీటిని అందించాలని మిషన్ భగీరథ అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి రోజు తన వద్దకు వచ్చే 100 మంది రైతుల్లో ఎక్కువ మంది ధరణి సమస్యలపైనే వస్తున్నారని, ధరణి సమస్యలపై వచ్చే రైతులకు తహసీల్దార్లు రైతులతో దురుసుగా ప్రవర్తించకుండా వారి సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. బిజినపల్లి మండలంలోని ఎన్నికల ముందు హడావిడిగా మార్కండేయ ఎత్తిపోతల పథకాన్ని గత ప్రభుత్వం ప్రారంభించిందని, 7 నెలలు గడిచిన ఇంత వరకు ఎలాంటి పురోగతి లేకపోవడమేమిటని ప్రశ్నించారు. ప్రాజెక్టులో పనులు జరుగుతున్నాయా, జరుగవా అని అధికారులను ఆయన ప్రశ్నించారు. అధికారులు తమ శాఖల పురోగతి అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేతో సంబంధిత సమస్యలపై చర్చిస్తే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు వీలుంటుందని సూచించారు. అధికారులు పూర్తి పారదర్శకంగా పనిచేయాలన్నారు. జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ మంత్రివర్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు చేసిన సూచనల విధంగా ప్రజలకు మెరుగైన పాలన అందించే విధంగా జిల్లా అధికార యంత్రాంగం పనిచేయాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా తహసీల్దార్లు రానున్న వారం రోజుల్లో పెండింగ్ ధరణి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ధరణి ఫిర్యాదుల పరిష్కారం కోసం రాత్రి 9 గంటలకు ప్రతి రోజు టెలికాన్ఫరెన్స్ నిర్వహించడంతో పాటు అకస్మిక తనిఖీలు ఉంటాయని, నిర్లక్ష్యం వహించే తహసీల్దార్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా విడుదలయ్యే ప్రతి నీటిని జిల్లా రైతాంగానికి వినియోగించాలంటే ప్రతి నియోజకవర్గంలో 5 టీఎంసీల నీటి నిలువల కోసం ఒక రిజర్వాయర్లు, డిస్టిబ్యూషన్ కెనాల్లు ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఎంతైన ఉందన్నారు. డిండి లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి కృష్ణానది నుంచి ఎత్తిపోసిన నీరు మళ్లీ కృష్ణా నదిలోకే వెళ్తుందని, తద్వారా విద్యుత్ ఖర్చు వృధా అవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని, సేవ్ గవర్నమెంట్ ల్యాండ్స్ అనే నినాదంతో విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని సూచించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి భూములు ఇచ్చిన రైతులకు ఇప్పటి వరకు నష్ట పరిహారం అందలేదని, ప్రతి రోజు రైతులు తనతో వాగ్వాదం చేస్తున్నారని, రైతులకు నష్టపరిహారం అందేలా అధికారులు పరిష్కారాన్ని త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. ధరణిలో కొంత మంది పట్టా రైతుల భూములు ఇళ్ల స్థలాలుగా చూపిస్తున్నాయని, వాటిని రెవెన్యూ అధికారులు సరిచేయాలని చూపిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు ప్రజా ప్రతినిధులతో చర్చించి అభివృద్ధి ఫలాలను ప్రజలకు చేరేలా అధికారులు కృషి ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలో గాలి వర్షానికి 200కు పైగా విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయని, వెంటనే వాటిని పునరద్ధరించాలన్నారు. కొంతమంది ఏఈలు ప్రజా ప్రతినిధులు చెబితే వినాలని ధోరణిలోఉన్నారని, ప్రజాప్రతినిధులు అధికారులు కలిసి కట్టుగా పనిచేస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందనే విషయాన్ని గ్రహించాలని ఆయన సూచించారు. ధరణి రెవెన్యూ సమస్యలపై వచ్చే రైతులకు తహసీల్దార్లు వినయంతో వారికి సమాధానం చెప్పి పని అవుతుందో లేదో అనే విషయాన్ని తెలియజేయాలన్నారు. రైతులను కార్యాలయాల చుట్టు తిప్పుకోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారుల సమీక్ష సమావేశానికి విచ్చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావును జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, చీర్ల శ్రీనివాసులు, జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడి, శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.



మంత్రికి పూల మొక్కను అందిస్తున్న కలెక్టర్



సమావేశానికి హాజరైన అధికారులు

## కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నా



ఏఓకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

**గద్వాల ప్రతినిధి, జూన్ 27 ప్రభాతవార్త:** కేంద్ర బిజెపి ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాటను ఆపి, సింగరేణికి నేరుగా కేటాయించాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ డిమాండు చేశారు. సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ముందు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కేంద్ర బిజెపి ప్రభుత్వం వేలం పాటను వేస్తు న్నదని, సింగరేణి కంపెనీ కూడా ప్రైవేట్ సంస్థలతో వేలం పాటతో పోటీ పడాలని స్థితికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. వాస్త వానికి శ్రావణపల్లిలో సింగరేణి సంస్థ బొగ్గు తవ్వాలి కానీ వేలం పాట ద్వారా ప్రైవేటు సంస్థలకు అవకాశం కల్పించి బొగ్గు గనులను సరైంది కాద న్నారు. మన రాష్ట్రం నుంచి బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా వేలం పాటను ప్రారంభించడం సిగ్గు చేటు అని అన్నారు. బొగ్గు గనులన్నీ ప్రైవేటు సంస్థలకు ఇచ్చిన తర్వాత సింగరేణి మిగిలేదేముంటుందని,క్రమంగా సింగరేణి సంస్థను బలహీన పరిచి నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. నగదీకరణ పేరు తో దేశంలో ఆరు లక్షల కోట్ల విలువైన ఆస్తులను కేంద్ర ప్రభుత్వం ప్రైవే టు సంస్థలకు కట్టబెట్టిందని అందులో భాగంగానే కోట్ల విలువైన గనుల ను ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలని నిర్ణయాన్ని తీసుకుందని విమర్శిం చారు. గత పది సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం దాదాపుగా 200 బొగ్గు బావులను ప్రవేశ సంస్థలకు కట్టబెట్టారని ప్రభుత్వ రంగంలో గనులు లేకపోతే యువతకు ఉపాధి అవకాశాలు కనుమరుగవుతాయి. అని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణికి చెందిన 22 బొగ్గు బావుల్లో బొగ్గు నిల్వలు అడగండి పోయాయని కొత్త బ్లాకుల్లో తవ్వకాలు ప్రారంభించాలని కానీ కేంద్ర బిజెపి ప్రభుత్వం ఇందుకు అనుమతించకుండా మోకాలు అడ్డుతున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం వల్ల తెలంగాణ ప్రజానీకానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని, కాబట్టి శ్రావణపల్లి బ్లాకుతో పాటు మిగతా బ్లాక్‌లను కూడా తక్షణమే సింగరేణి అప్పగించాలని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అచలపక్షాన్ని కలుపుకుని కేంద్రం మీద ఒత్తిడి చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.రాజు వివి నరసింహ, ఉప్పేర్ నరసింహ బాలకృష్ణ, రాజు, వెంకటేశ్, పరుశురాముడు, మజ్జిగ ఆంజనేయులు, గజేంద్ర , అయ్యప్ప, నరసింహ, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా గృహజ్యోతి



ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల గూర్చి మహిళా రోగిని అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

మొదటి పేజీ తరువాయి భాగం...

దవఖానలోని ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. ఆసుపత్రిలోని ప్రతి వార్డును కలియ తిరుగుతూ రోగులతో మాట్లాడారు. ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రి పరిశుభ్రంగా ఉంచాలని వైద్యాధికారికి సూచించారు. అక్కడి నుండి నేరుగా ఆగ్రో రైతు సేవ కేంద్రం 2 ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతులకు ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎరువులు, పురుగు మందుల సరఫరా గురించి స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన విత్తనాలను విక్రయించేలా వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ ఉండేలా చూడాలని వ్యవసాయశాఖ ఏడి యశ్వంతరావును కలెక్టర్ ఆదేశించారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులతో కంప్యూటర్ విద్య, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అంటూ విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనులు పరిశీలించి వివరాలను ఇంఛార్జి ఎస్ఓను అడిగి తెలుసుకున్నారు. భోజనం ఎలా ఉంది, విద్య మంచిగా అందిస్తున్నారా అంటూ కలెక్టర్ విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనాన్ని అందించాలని, పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా విద్యార్థినిలను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయ బృందాన్ని ఆదేశించారు. కలెక్టర్ వెంటఎంపిఓ అనిల్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ రఘు, తహసిల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ క్రాంతిగౌడ్, ఆర్ఐ శశికిరణ్ ఉన్నారు.

## రూ.కోటీ 80లక్షలతో ఉడాయించిన ఫైనాన్స్ వ్యాపారి

మొదటి పేజీ తరువాయి భాగం..

అతని బావమరిది సురేష్ మీకు రెండు రూపాయల వడ్డీ ఇస్తాము అని చెప్పి మమ్మల్ని మోసం చేశాడని వారు తెలిపారు. అయితే మా దగ్గర లక్షల రూపాయలు ఒకరికి తెలియకుండా ఇప్పించుకోవడం జరిగిందని వారు తెలిపారు. పెబ్బేరులో ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నానని దానికి పెట్టుబడి కావాల్సిన అవసరం ఉందని ఆయన వారితో చెప్పినట్లు వారు తెలిపారు. ఈ డబ్బులు మీకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆరు నెలలకు తిరిగి చెల్లిస్తానని చెప్పి డబ్బులు ఇప్పించుకోవడం జరిగిందని వారు తెలిపారు. అయితే గోవర్దనగిరి లో అతనికి ఉన్న భూమిని ఇంటిని అమ్మి తనకు ఎలాంటి ఆస్తి లేదని సృష్టించడం జరిగిందని వారు తెలిపారు అయితే తాము ఇచ్చిన డబ్బులు ఇవ్వాలని బొలెమోని ఆంజనేయులు అడగగా నేను ఫైనాన్స్‌లో డబ్బులు లేవని అతను మోసం చేసినట్లు బాధితుల ఫిర్యాదు చేశారు. అయితే బాధితుడు అప్పులు ఇచ్చినటువంటి వారు అడగకుండా కోర్టు నుండి ఐపి దాఖలు చేసుకున్నట్లు తెలిపారు. అప్పుల గురించి మేము అడగగా మీరు ఏం చేసుకుంటారో చేసుకోకండి నాతో ఒక పైస లేదు నేను ఫైనాన్స్‌లో వ్యాపారం పెట్టి నష్టం వచ్చింది అని మేము ఇచ్చినటువంటి అప్పులను ఇవ్వకుండా ఉడాయించారు అని తెలిపారు. తమకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్‌లో తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమకు అధికారులు న్యాయం చేయాలని వారు కోరారు.

## మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి

**కొత్తకోట జూన్ 27 ప్రభాతవార్త :** మొక్కలు నాటండి పర్యావరణా న్ని కాపాడండి. అని సాగర్ స్నేక్ సొసైటీ వ్యవస్థాపకులు కృష్ణసాగర్ అన్నారు. ఈ నెల 20వ తేదీన అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు చేపట్టిన పాదయాత్ర బుధవారం సాయంత్రం కొత్తకోటకు చేరుకుంది. దింతో పట్టణ నాయకులు కృష్ణ సాగర్ కు ఘన స్వాగతం పలికారు. గురువారం ఉదయం అయ్యప్ప స్వామి దేవాలయం దగ్గర, భగీరథ మహర్షి, చత్రపతి శివాజీ విగ్రహాల దగ్గర పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొత్తకోట పోలీస్ స్టేషన్, రోడ్డు ఇరువైపులా సీఐ రాంబాబు, ఎస్సై మంజునాథ్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం సాగర్ కులస్తులు కలిసి బైపాస్ పాసుబుక్ వరకు పాదయాత్రగా వెంట గ్రామానికి చేరుకొని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కార్యక్రమం కల్పించారు. అదేవిధంగా మాజీ పార్లమెంట్ సభ్యులు రావు చంద్రశేఖర్ రెడ్డి ఘన స్వాగతం పలికి శాలువతో సత్కరించి అభినందించారు. అ నుంచి కనిమెట్ట గ్రామానికి చేరుకోగా గ్రామస్తులు కోటేశ్వర్ రెడ్డి మరి కొందరు కలిసి కృష్ణసాగర్ కి స్వాగతం పలికి మొక్కలు నాటించారు. అడ్డాకల్ వైపు ప్రయాణం సాగింది. ఈ కార్యక్రమంలో నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

మొదటి పేజీ తరువాయి భాగం..

సంగంబండ రోడ్డు మార్గంలోని కస్తూర్బా విద్యాలయాన్ని పరిశీలించారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అక్కడి ఎస్ఓను అడిగి తెలుసుకున్నారు. ఆ పాఠశాలలోని 6,8,9వ తరగతితో పాటు ఇంటర్ సెకండియర్ విద్యార్థులతో మాట్లాడి, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి వెళ్లాలని అందరికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఆ పాఠశాల ప్రహరీని పరిశీలించారు. పాఠశాల ఆవరణలో వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు పెంచాలని, కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని, జిల్లాలో ఈ కస్తూర్బా పాఠశాలను ఒక మాడల్‌గా మార్చాలని అక్కడి ఎస్ఓను సూచించారు. కాగా అంతకు ముందు కలెక్టర్ మండలంలోని ఉప్పర్ పల్లి ప్రాథమిక పాఠశాలను పరిశీలించి కొత్తగా చేపట్టిన నిర్మాణ పనుల గురించి తెలుసుకున్నారు. ఆ పాఠశాలలోనూ విద్యార్థులకు యూనిఫాంలు నేటికి పంపిణీ చేయకపోవడంపై అసహనం వ్యక్తం వెంటనే యూనిఫాంలు అందజేయాలని ఆదేశించారు. ఆ పాఠశాలకు చెందిన ఒకటో తరగతి నుంచి ఐదవ తరగతి విద్యార్థులకు కలెక్టర్ పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఆయా కార్యక్రమాలలో పిఆర్ఈ హీర్యానాయక్, సెక్టోరల్ ఆఫీసర్ శ్రీనివాస్, మక్తల్ తహసిల్దార్ సువర్ణరాజు,మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్, ఎంపిడిఓ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బుక్స్ అందజేస్తున్న కలెక్టర్

## బ్యాంకర్లు రుణాల లక్ష్యాలను చేరుకోవాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

బ్యాంకర్లతో డిసిసి, డిఎల్ఆర్‌సి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023,24 ఆర్థిక సంవత్సరంలో 2024 మార్చి 31 ముగింపు నాటికి జిల్లా వార్షిక రుణ ప్రణాళికలో 5488 కోట్ల రుణ లక్ష్యానికి గాను 5688 కోట్ల రుణాలను మంజూరు చేసి 103శాతం సాధించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు గాను రూ.2706 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగానికి 963 కోట్ల రుణాలను ప్రాధ్యాత రంగానికి 3785 కోట్ల రూపాయలు ప్రాధాన్యేతర రంగాలకు 1903 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలోపిఎం, ఈజిపికింద యూనిట్‌ల స్థాపించడానికి అర్హులైన వారికి రుణాలు అందించాలని ఆదేశించారు. గత సంవత్సరం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను బ్యాంకర్‌లు మంజూరు చేయా లని అన్నారు. జిల్లాలో ఎస్‌టి కార్పోరేషన్ ద్వారా 2020, 21,2021,22 ఆర్థిక సంవత్సరాలలో ద్వారా రుణాలు పెండింగ్‌లో ఉన్నవి మంజూరు చేయాలని సూచించారు. ఈఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా ఎస్‌హెచ్ జి మహిళా సంఘాల సభ్యులకు వ్యక్తిగత, గ్రూప్ ద్వారా వివిధ కార్యకలాపాలకు బ్యాంక్‌ల ద్వారా రుణం మంజూరు చేయాలని కోరా రు. జిల్లాకు నిర్ణయించిన ఆయా కార్యక్రమాల లక్ష్యం ప్రకారంరుణం మంజూరు చేయాలని సూచించారు. జిల్లాలో బ్యాంకర్లు, జిల్లా అధికారులు అందరూ సమిష్టిగా కృషిచేసి జిల్లా అభివృద్ధి కోసం పని చేయాలన్నారు. వ్యవసాయ, ప్రాధాన్యత రంగాలకు ప్రాధాన్యత నివ్వాలని ఆమె సూచించారు. 2024,25 జిల్లా వారికి రుణ ప్రణాళిక విడుదల సమావేశంలో 8390కోట్ల 62లక్షల రూపాయల అంచనాతో రూపొం దించిన జిల్లా వార్షిక రుణ ప్రణాళికను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు 4929.42 ఓట్ల రూపాయలు, ఎంఎస్ఎంఈ రంగాలకు 1775కోట్ల30లక్షల రూపాయలు, ప్రాధాన్యత రంగాలకు 6848కోట్ల87లక్షల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కల్వభాస్కర్, ఆర్బీఐ లీడ్ జిల్లా అధికారి ఎం.జడ్‌రహమాన్, నాబార్డుజిల్లా అభివృద్ధి మేనేజర్ పి. షణ్ముఖచారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్రి బోయి



## జ్ఞానవంతమైన విద్యను అందించాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

చెప్పారు. ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ కరువవడంతో తల్లిదండ్రులు కష్టపడి తమ పిల్లలను ప్రైవేటుకు పంపిస్తున్నారని, వారి సంపాదన అంతా విద్య, వైద్యానికి ధారపోస్తున్నారని చెప్పారు. ఆ దుస్థితి నుంచి విముక్తి కల్పిస్తే ప్రజలకు ఖర్చవడంతో పాటు వారి ఆదాయం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు పెరిగాయన్నారు. ఆరోగ్యవంతమైన, జ్ఞానవంతమైన సమాజ నిర్మాణమవుతుందనే ఆలోచనలతో ప్రభుత్వం అత్యాధునిక పద్ధతుల ద్వారా విద్యార్థులకు విద్యాబోధన అందిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ విద్యాలయాల బలోపేతం ద్వారా కార్పొరేట్ విద్యా సంస్థలకు చెక్‌పెట్టొచ్చని వెల్లడించారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను చేరువ చేయాలనే సంకల్పంతో కార్యక్రమం ముందుకు సాగుతుందన్నారు. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసినట్లు అవుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తప్పనిసరిగా గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలన్నారు.



విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే పాఠశాల ఉపాధ్యాయ బృందంశాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, కౌన్సిలర్లు నిజాం, శ్రీను, కొండ నాగేష , పప్పిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు దినేష్, నాగరాజు, నానిగౌడ్ ఖాదర్ తదితరులు ఉన్నారు.